క్లుప్తంగా

ఉత్సవాల పేరిట ఉపాధి పనులు నిలపడం తగదు

దేవరుప్పుల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట ఉపాధి హామీ కూలీల పనులు నిలిపివేయడం తగదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గండిపెల్లి యాకయ్య విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసమే అధికార కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా నిర్వహిస్తున్నారని, అధికారుల తమ విధులను విస్మరిస్తూ ప్రజల్ని పక్కదారి పట్టించే చర్యలకు స్వస్తి పలుకాలని హితవు పలికారు.

నియామకం


ఉపేందర్

లింగాలఘణపురం: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన రాగల్ల ఉపేందర్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాగల్ల ఉపేందర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో సాధన, జాతి భవిష్యత్ ధ్యేయంగా అంకిత భావంతో పని చేస్తానని, తన నియామకానికి సహకరించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు, అధికార ప్రతినిధి భిక్షపతికి కృతజ్ఞతలు తెలిపారు.

లింకు రోడ్ల అభివృద్ధికి మంత్రి కృషి

పాలకుర్తి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని లింకు రోడ్లు అభివృద్ధికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృషి చేస్తున్నారని పెద్దతండా(కె)సర్పంచ్ లావుడ్యా శాంతమ్మ అన్నారు. గురువారం మండలంలోని పెద్దతండా (కె) శివారు శీతి తండా నుంచి కొండాపురం శివారు మేకల తండా ఎక్స్ రోడ్డు వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులను సర్పంచ్ శాంతమ్మ ప్రారంభించారు. కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లావుడ్యా దేవానాయక్, ఎంపీటీసీ రమేష్‌నాయక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించండి



బచ్చన్నపేట: గ్రామాల్లో ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని మండలంలోని బండనాగారం, కొడవటూర్ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు సుంకోజు రజిత, ప్రేమలక్ష్మి అన్నారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు మాట్లాడుతూ తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

పంటపొలానికి తాగునీరు..!




భగీరథ ట్యాంకు నుంచి వ్యవసాయ పొలానికి వేసిన పైపులైన్

దేవరుప్పుల: వ్యయ ప్రయాసాలతో ప్రజలకు తాగునీటిని ప్రభుత్వం అందిస్తున్న క్రమంలో సదరు శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వెరసీ దుర్వినియోగమవుతున్న సంఘటన చిప్పరాళ్లతండాలో చోటుచేసుకుంది. కడవెండి రెవెన్యూ పరిధి చిప్పరాళ్లతండా పంచాయతీలోని దళపతి తండా సమీపంలో గత కొద్దిరోజులుగా ఓ వ్యక్తి యథేచ్ఛగా భగీరథ తాగునీటి ట్యాంకు నుంచి తండాకు సరఫరా అయ్యే పైపులైన్‌కు లింకుపెట్టి తన వ్యవసాయ పొలానికి నీటిని మల్చాడు. ఇదే కాకుండా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణను సైతం సాగులోకి మార్చినప్పటికీ అధికారులు, పంచాయతీ పాలకవర్గం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిచడం గమనార్హం.

ఫీజుల నియంత్రణ చట్టం అమలుచేయాలి

విద్యారణ్యపురి: ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, అనుమతిలేని పాఠశాలలను రద్దు చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ ఇంటర్నేషనల్ బాధ్యుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ కోరారు. ఈమేరకు డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి గురువారం వినతిపత్రం అందజేశారు. అనుమతులు లేని ప్రైవేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల బాధ్యులు ప్రణీత, కావ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



బచ్చన్నపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్‌లో చెరువుల పండుగ ర్యాలీలో ఎమ్మెల్యే రాజయ్య



ఘనంగా చెరువుల పండుగ

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రజలు బతుకమ్మలు, బోనాలతో చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని చెరువు కుంటల కట్టమైసమ్మల వద్ద పూజ చేసి బోనాలను సమర్పించి బతుకమ్మ ఆడి అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ చెరువులు గ్రామాల్లోని సబ్బండవర్గాలకు కల్పతరువు లాంటివని అన్నారు. గతంలో సీమాంధ్ర పాలకుల కారణంగా చెరువులు నిరాదరణకు గురయ్యాయని.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ చెరువులు పూర్వ వైభవం సంతరించుకునేలా కోట్లాది రూపాయలు వెచ్చించారన్నారు. చెరువు కట్టలు, పూడిక మట్టి, మత్తళ్లు, తూముల అభివృద్ధితో జలకళ సంతరించుకొందన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


జనగామ: శామీర్‌పేట చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


జనగామ: అడవికేశ్వాపూర్ చెరువు వద్దకు వెళ్లడానికి ర్యాలీగా బయలుదేరిన ప్రజలు


రఘునాథపల్లి: ర్యాలీలో పీఆర్ డీఈ చంద్రశేఖర్ తదితరులు


పాలకుర్తిలో..


నర్మెటలో..


రఘునాథపల్లి: నిడిగొండలో బోనాలతో గ్రామస్తులు


నర్మెట: వెల్దండ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు


కొడకండ్ల: లక్ష్మక్కపల్లిలో..


జఫర్‌గఢ్: తిమ్మంపేటలో..


లింగాలఘణపురం: బోనంతో ఎంపీపీ జయశ్రీ తదితరులు


తరిగొప్పుల: కట్టమైసమ్మ వద్దకు తరలివెళ్తున్న నాయకులు


చిల్పూరు: మాట్లాడుతున్న ఏసీపీ రఘుచందర్


దేవరుప్పులలో కట్టమైసమ్మకు మొక్కులు


దేవరుప్పుల: బోనాలఊరేగింపులో జెడ్పీటీసీ భార్గవి


బచ్చన్నపేట: ఆలింపూర్‌లో..


చిల్పూరు: బోనాలతో ఎంపీపీ సరిత తదితరులు

ముదిరాజ్‌లు బీసీలు కాదా..!

నర్మెట: ముదిరాజ్‌లు బీసీలుకాదా.. రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసే జాబితాలో ముదిరాజ్‌లను చేర్చకపోవడంలో ఆంతర్యమేమిటని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది రెడ్డబోయిన రాజు అన్నారు. మండలంలోని హన్మంతాపూర్‌లో గురువారం మాట్లాడుతూ జాబితాలో ముదిరాజ్‌లను చేర్చకుండా దశాబ్ది ఉత్సవాల సాక్షిగా ముదిరాజ్‌లను అవమానపరిచిందని ప్రభుత్వాన్ని తప్పుపట్టారు. కేవలం ఓటు బ్యాంకులాగా చూడరాదని అన్ని కులాల్లో కులవృత్తుల మాదిరిగానే ముదిరాజ్‌లను గుర్తించి రూ.లక్ష ఆర్థికసాయం జాబితాలో వెంటనే చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

పరిశీలన



స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక రిజర్వాయర్ కట్ట సమీపాన గురువారం నిర్వహించిన చెరువుల పండుగకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌శర్మ పరిశీలించారు. చెరువుల పండుగ నిర్వహణ ఏర్పాట్ల తీరుపై తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్, ఈఓ సత్యనారాయణతో మాట్లాడారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న చలో ఉస్మానియా మహా సదస్సును విజయవంతం చేయాలని సంఘం బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద వాల్‌పోస్టర్లను కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు, బాధ్యులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉన్నవారిని రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో జేఏసీ కన్వీనర్ డాక్టర్ సాధు రాజేష్, బాధ్యులు డాక్టర్ నిరంజన్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ వెంకటగోపినాథ్, డాక్టర్ చిర్ర రాజు డాక్టర్ మాదాసి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

బడి మనదే..బాధ్యతా మనదే

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారానే పేద విద్యార్థుల కు నాణ్యమైన ఉచిత విద్య అందుతుంది.. బడి మనదే.. బాధ్యతగా విధులు నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. 'బడిబాట'లో భాగంగా మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు. విద్యలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, పాఠశాలల్లో ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, కృష్ణమూర్తి, జి.కనకయ్య పాల్గొన్నారు.


బడిబాటలో ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

బచ్చన్నపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే జీవనోపాధి దొరుకుతుందని బేజాడి ట్రస్ట్ చైర్మన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. గురువారం మండలంలోని పోచన్నపేటలో క్రీడాకారులకు క్రికెట్ కిట్లను ఆయన అందజేసి మాట్లాడారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని, శరీరదారుఢ్యం కూడా పెరుగుతుందని అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు క్రీడాకారులకు ఆట వస్తువులను అందజేస్తున్నామని తెలిపారు. బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షులు గద్దరాజు , కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రికెట్ కిట్లను అందజేస్తున్న చైర్మన్ బేజాడి బీరప్ప

గడ్డివాము దగ్ధం

రఘునాథపల్లి: ప్రమాదవశాత్తు వ్యాపించిన మంటల్లో గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని దాసన్నగూడెంలో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపల్లికి చెందిన మల్కపురం చంద్రమౌళి దాసన్నగూడెం శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆవుల పశుగ్రాసం కోసం 3 ఎకరాల వరిగడ్డిని కొనుగోలు చేసి మోపులు కట్టుకొని వాము పేర్చాడు. వర్షాలకు పాడవకుండా వాముపై పరదాలు కప్పాడు. గురువారం మధ్యాహ్నం అటుగా మద్యం సేవించేందుకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి నిప్పు వేయడంతో మంటలు లేచినట్లు స్థానికులు చెబుతున్నారు. వడగాల్పులతో ఆ మంటలు గడ్డివామును చుట్టుముట్టాయి. స్థానికులు గుర్తించి ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వంగా అది ఘటనా స్థలికి వచ్చే సరిగా ఈదురు గాలులతో గడ్డివాము, పైన ఉన్న పరదాలు కాలి బూడిదయ్యాయి. మంటలు చుట్టు పక్కలకు వ్యాపించకుండా నివారించారు. పశుగ్రాసం కాలిపోవడంతో రూ.15 వేల నష్ట వాటిల్లినట్లు, ప్రభుత్వం ఆదుకోవలని బాధిత రైతు మల్కపురం చంద్రమౌళి కోరారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నిత్యావసరాల అందజేత

జనగామ రూరల్: సుప్రజ ఆస్పత్రి ఎండీ డాక్టర్ విజయ్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా వసీం అక్రం ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన శామీర్‌పేటకు చెందిన రాజు కుటుంబానికి నిత్యవసర సరుకులు గురువారం అందజేశారు. అలాగే వర్ధన్ ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, సంతోష్, రోహిత్, సాయి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందజేస్తున్న వసీం అక్రం

దాశరథి రంగాచార్యులుకు ఘన నివాళి



పాలకుర్తి టౌన్: మండలంలోని బమ్మెరలో శ్రీపోతన సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో దాశరథి రంగాచార్యులు వర్ధంతిని పోతన గ్రంథాలయ ఆవరణంలో నిర్వహించారు. రంగామాచార్యుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మాన్యపు భుజేందర్ మాట్లాడుతూ నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నిజాంను ఎదిరించిన ధీశాలి రంగామాచార్యులు అన్నారు. పోతన సాహిత్య కళావేదిక ప్రధాన కార్యదర్శి దేవసాని ఉపేందర్, కొంగ సురేష్, ఆకుల గణేష్, రమేష్, పెంతల కృపాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అమృతలో 'ఇంటింటి రామాయణం' సినీ బృందం సందడి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని అమృత థియేటర్‌లో ఇంటింటి రామాయణం సినిమా బృందం గురువారం సాయంత్రం సందడి చేసింది. ఈనెల 9న విడుదల కానున్న సినిమా ప్రీమియర్ షోను ప్రేక్షకుల కోసం గురువారం ఉచితంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రేక్షకులతో కలిసి సినిమాలోని నటీనటులు తిలకించారు. సినిమా అనంతరం వారు మాట్లాడుతూ యావత్ తెలంగాణలో ప్రతిఇంటిలో జరిగే సంఘటనల ఆధారంగానే ఈ సినిమా తీశామని, కుటుంబ సమేతంగా ప్రేక్షకులు ఈ సినిమా చూసి ఆదరించాలని కోరారు.

ప్రమాదకరంగా గుంత

చిల్పూరు: కేబుల్ వైర్లు వేయడానికి తీసిన గుంతలు పూడ్చకపోవడంతో అవి ప్రమాదకరంగా మారాయి. దీంతో ద్విచక్రవాహనదారులు రాత్రివేళల్లో అందులో పడి గాయాలపాలవుతున్నారు. మండలంలోని కృష్ణాజీగూడెం -ఫత్తేపూర్ రోడ్డులో నెలరోజుల క్రితం కేబుల్ వైర్లు వేసేందుకు రోడ్డు పక్కన గుంతలు తీశారు. కేబుల్ వేసిన అనంతరం వాటిని పూడ్చకపోవడంతో ఇటీవల నలుగురు వాహనచోదకులు అందులో పడి గాయాలపాలయ్యారు. పెద్ద ప్రమాదం సంభవించకముందే వాటిని పూడ్చివేయాలని సీపీఎం నాయకుడు సాదం రమేష్, బీఆర్ఎస్ నాయకుడు పోలు వెంకట్, వాహనదారులు కోరారు.


తవ్వి పూడ్చని గుంత

తెలంగాణ వచ్చాకే చెరువులకు మహర్దశ

చిల్పూరు: తెలంగాణ ప్రభుత్వం వచ్చాకే చెరువులకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని రాజవరంలో గురువారం రాత్రి చెరువుల పండుగలో భాగంగా (రాజవరం పెద్ద చెరువు) దేవాదుల రిజర్వాయర్‌లో తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముదిరాజ్ కులస్తులు తెప్పల పోటీలను నిర్వహించారు. బహుమతుల ప్రదానోత్సవానికి సర్పంచ్ మారేపల్లి తిరుమల అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకప్పుడు వర్షా కాలంలోనే నిండే చెరువులు నేడు కాలాలతో పని లేకుండా నీటితో నిండుకుండలా కనిపిస్తున్నాయని అన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఎంపీటీసీ మారేపల్లి లలితదేవి, సంఘం నాయకులు నీల గట్టయ్య, నీల రాజు, బుస్స మల్లేషం, అశోక్, గోరంటల గిరి, రేఖరాజు, ఈర్ల సమ్మయ్య, రాజు, వెంకటనర్సు, సమ్మయ్య పాల్గొన్నారు.


తెప్పల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

లింగాలఘణపురం: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మండల పరిధి కుందారం పాఠశాలలో బుధవారం రాత్రి 'పల్లెనిద్ర' చేసిన ఆయన గురువారం ఉదయం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం చెరువు కట్ట వద్ద మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ, తహసీల్దార్ అంజయ్య, నోడల్ ఆఫీసర్ విష్ణు, సర్పంచ్ సుగుణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, నాయకులు రాంచందర్, నాగేందర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రగతి నివేదన యాత్ర

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే రాజయ్య చేపట్టిన ప్రగతి నివేదన యాత్రలో భాగంగా సముద్రాల, ఇప్పగూడెం, రంగరాయగూడెం, అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులను శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.


కుందారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కులమతాలకు అతీతంగా మెలగాలి

న్యూశాయంపేట: కుల, మతాలకు అతీతంగా ప్రతీఒక్కరు సోదరాభావంతో మెలగాలని ప్రముఖ కవి రవికుమార్ సూచించారు. బజ్మే గుల్షన్ అదాబ్ వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో హజ్ యాత్రికులకు గురువారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వహీద్ గుల్షన్, అబ్దుల్ ఖాదర్, సిరాజుద్దీన్, సయ్యద్ ఫైజుల్లా, సయ్యద్ మిస్బా పాల్గొన్నారు.